క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

కమలాపూర్: మండలంలోని భీంపల్లికి చెందిన పసుల రాజమ్మ (70) ఇటీవల వంట గ్యాస్ లీకైన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా రాజమ్మ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ తెలిపారు. ఈ నెల 4న ఉదయం రాజమ్మ తన ఇంట్లోని ఇండియన్ గ్యాస్ స్టవ్‌ను వెలిగించగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకవడంతో గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటింటా ప్రచారం



శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డు స్కీంపై కాంగ్రెస్ పార్టీ యూత్ డోర్‌టూడోర్ క్యాంపెయిన్ ఇన్‌చార్జ్ బడితల ప్రసాద్ ఆధ్వర్యంలో జీవనగర్‌కాలనీలో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఓట్ల కోసం మాయమాటలు చెబుతున్న బీఆర్‌ఎస్ మాటలను ప్రజలు నమ్మొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు సాదు నాగరాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సుకుమార్, సతీష్, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ కార్యవర్గం ఎన్నిక



కమలాపూర్: శ్రీవెంకటేశ్వర బైక్ మెకానిక్ అసోసియేషన్ మండల కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా పోలోజు భాస్కరాచారి, ఉపాధ్యక్షుడిగా కొలిపాక శంకర్, ప్రధాన కార్యదర్శిగా చిలుక రాజేందర్, కార్యదర్శిగా చేరాల అశోక్, కోశాధికారిగా కొండి రాజు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా దాసరి కోటి, ఎగ్గోజు శ్రీనివాసాచారి, తంగళ్లపల్లి సురేష్, గువ్వాడి సదానందం, కొలువూరి రాము, చేరాల సాయికృష్ణ, ధార్మరు నాగరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కట్కూరి అశోక్ రెడ్డి, బూర వెంకన్న, శివకృష్ణ, రవితేజ, నాగరాజు, చిలువేరి ఆనంద్, శనిగరపు మాధవ్, తిరుపతి, షరీఫొద్దీన్, శ్రీకాంత్, రాజు, పవన్ చారి, నితిన్ రవి, పవన్, ప్రశాంత్, సాయి, చరణ్, రాకేష్, సాగర్, క్రాంతి, రాజేష్, సంపత్, అంజద్, శ్రీకాంత్, మల్లేశం, షఫీ, ప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనకు తరలిరావాలి

శాయంపేట : రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం భూపాలపల్లి పట్టణంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పెద్దల నుంచి ప్రాణహాని.. రక్షణ కల్పించండి



పెళ్లి పత్రాన్ని చూపుతున్న శివకుమార్, హారిక

హన్మకొండ: ప్రేమించి పెండ్లి చేసుకున్న తమకు రక్షణ కల్పించాలని నవ వధువరులు కోరారు. ఈమేరకు ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఐనవోలు మండలం కొండపర్తికి చెందిన గుగ్గిళ్ల శివకుమార్, కాజీపేట మండలం భట్టుపల్లికి చెందిన జక్కుల హారిక చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. కలిసి చదువుకుని గ్రాడ్యుయేట్ పూర్తి చేశారు. ఈక్రమంలో తమ పెళ్లి ప్రస్తావన తీసుకురాగా, కులాలు వేరు కావడంతో అబ్బాయి తల్లిదండ్రులు ఒప్పుకోగా, అమ్మాయి తల్లిదండ్రులు మాత్రం ససేమిరా అన్నారు. దాంతో ఈనెల 4వ తేదీన చిల్పూరు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పెళ్లి చేసుకున్నారు. తమకు రక్షణ కల్పించాలని అదేరోజు సాయంత్రం ఐనవోలు పోలీసులకు విన్నవించుకున్నారు. అయితే, అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు అబ్బాయి ఇంటిపై దాడి చేశారు. ఈ విషయంపై ఐనవోలు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారిరువురు ఆవేదన వ్యక్తం చేశారు.

సప్తవర్ణాభిషేక పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి నిత్యకల్యాణ మహోత్సవాన్ని అర్చకులు ఆదివారం నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడి ఉత్సవ విగ్రహాలతో పాటు శ్వేతార్కుడికి సప్తవర్ణాభిషేకంతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు కొనసాగాయి.

ప్రతిపక్షాల మోసపూరిత మాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ఆత్మకూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు: ప్రతిపక్షాల మోసపూరిత మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గుడెప్పాడ్‌లో ఆదివారం డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఏ పథకం ప్రవేశపెట్టినా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నదని, బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలను ఇక్కడ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలు రాగానే మాయమాటలతో వస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, సర్పంచ్ బీరం శ్రీలత, వైస్‌ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జనగాం సాంబయ్య, ఎన్కతాల్ల రవీందర్, దుంపల బుచ్చిరెడ్డి, రవియాదవ్, రవిందర్‌రెడ్డి, కేశవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

పరకాల: సీఎం కేసీఆర్ దూరదృష్టితో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ప్రతి ప్రతి కుటుంబానికి విడతల వారీగా అందేలా చేయడం తమ బాధ్యత అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వెల్లంపల్లిలో నూతనంగా నిర్మించిన మహిళా భవనంతో పాటు 29 డబుల్ బెడ్రూం ఇళ్లతో చేపట్టిన కేసీఆర్ కాలనీ–3ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం కాలనీలో సర్పంచ్ వెలగందుల కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార దాహంతో బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని, ఆ రెండు పార్టీల మాటలు నమ్మి ఓటు వేస్తే అభివృద్ధిలో మళ్లీ 50 ఏళ్ల తెలంగాణ వెనుకబడిపోవడం ఖాయమన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు జన్ ధన్‌ఖాతాలలో రూ.15లక్షల చొప్పున వేస్తామని చెప్పిన విషయాన్ని ఆచరిస్తేనే ఓట్లు వేయాలన్నారు. అలాగే కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేయాలో నిలదీయాలని చెప్పారు. కార్యక్రమంలో పరకాల ఎంపీపీ టి.స్వర్ణలత, జెడ్పీటీసీ సిలువేరు మొగిళి, మార్కెట్ చైర్మన్ హైమావతి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పరకాల తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలి



ప్రభుత్వ భూమిలో పార్క్ చేసిన తహసీల్దార్ కారు

ధర్మసాగర్: ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు టేకుమట్ల విష్ణు డిమాండ్ చేశారు. మండలంలో అక్రమ వెంచర్లతో పాటు ప్రొసీడింగ్ కాపీలు మంజూరు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సహకరించి వెంచర్లలో భాగస్వామిగా చేరారని తెలిపారు. ప్రశ్నించినవారిని అక్రమంగా కేసుల్లో ఇరుకించారని ఆరోపించారు. మండల కేంద్రంలోని 1104 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో రియల్టర్లతో కలిసి కొంత భూమిని బినామి పేర్లతో కొనుగోలు చేశారని, ప్రస్తుతం ఆ భూమి వద్దకు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి వచ్చి ఆమె కొనుగోలు చేసిన భూమిలో హద్దురాళ్లను పాతిస్తున్నారని పేర్కొన్నారు. ఆ సంఘటన చూసిన తనతో పాటు స్థానికులు వీడియోలు తీసే ప్రయత్నం చేయగా గమనించిన సదరు తహసీల్దార్ స్థానిక సీఐకి ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే తనను పోలీసులు అదుపులోకి తీసుకొని నాలుగు గంటల పాటు పోలీస్ స్టేషన్‌లో ఉంచారని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తూ అక్రమాస్తులను కూడబెట్టుకోవడం సమంజసమా..? అని ప్రశ్నించారు. తహసీల్దార్ అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్య తీసుకోవాలని కోరారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే 'గృహలక్ష్మి'



పత్రాలు పంపిణీ చేస్తున్న కృపాకర్‌రెడ్డి

దామెర: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టిందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు పోలం కృపాకర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకంతో నిరుపేదల సొంతింటి కళ నెరవేరుతుందన్నారు. ప్రతిగడపకూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరుతున్న తరుణంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యుడు దామెరుప్పుల శంకర్, గ్రామపార్టీ అధ్యక్షుడు బత్తిని చిన్నరాజు, ప్రధానకార్యదర్శి వేల్పుల ప్రసాద్, వార్డు సభ్యులు మేరుగు సంపత్, వంగ రవి, దామెర సుమన్, సంజీవ, యూత్ నాయకులు మేరుగు సంతోష్, చల్లా బాలరాజు, కార్యదర్శి నరేష్, కారోబార్ బొబ్బిలి పాల్గొన్నారు.

అంతమందికి శిక్షణ ఇవ్వడం మా వల్లకాదు

- వెనుదిరిగిన కుట్టుమిషన్ శిక్షణ నిర్వాహకులు



ఆందోళన చేస్తున్న మహిళలు

పరకాల: స్వయం ఉపాధితో మహిళలు ఎదగాలని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్న మాటలకు మహిళల్లో చైతన్యం వచ్చినట్లు కనిపిస్తోంది. కుట్టు మిషన్ శిక్షణకు 15 మందిని ఎంపిక చేయగా ఒక్కో సెంటర్‌కు 100 మంది తరలివచ్చారు. దీంతో కుట్టుమిషన్ నిర్వాహకులు హడలెత్తిపోయారు. పట్టణంలోని మున్సిపాలిటీ విలీన గ్రామాలైన రాజీపేట, సీతారాంపూర్ పరిధిలోని 6,7,8 వార్డుల్లోని మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో రాజీపేట గ్రామంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయగా ఒక్కో వార్డు నుంచి 15 మందిని ఎంపిక చేశారు. కానీ ఒక్కో సెంటర్‌కు 30 మందికి పైగా తరలిరావడంతో 100 మందికి తాము నేర్పలేమంటూ శిక్షణ నిర్వహకులు వెళ్లిపోయారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన మహిళలు కొద్ది సేపు శిక్షణ కేంద్రం ఎదుట ఆందోళన నిర్వహించారు. సాయంత్రం వరకు శిక్షణ నిర్వాహకులు ఏవరూ రాకపోవడంతో ఆందోళన విరమించి ఇంటి బాట పట్టారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ

ధర్మసాగర్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను హనుమకొండ డీసీపీ మహ్మద్ అబ్దుల్‌బారి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, సిబ్బంది విధుల నిర్వాహణ, మహిళా సిబ్బంది సమస్యలు, తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలను అడిగిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు.

ఆత్మగౌరవ సభకు తరలిన ముదిరాజ్‌లు



సభకు తరలివెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

దామెర: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించతలపెట్టిన ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి ముదిరాజ్‌లు ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు. దామెర నుంచి మాజీ డైరెక్టర్ ఆలేటి లింగమూర్తి, ఆలేటి జనార్దన్, పిట్ట మొగిలి, సోనబోయిన రాజు, పల్లెబోయిన మహేందర్, ఆలేటి నారాయణ, గోల్కొండ రవి, సోనబోయిన విజయ్, శ్రీను, పిట్టల అరవింద్, కిన్నెర హేమంత్, ఆలేటి సాకేత్, సాత్విజ్, అభిలాష్, పిసర గణేష్ వెళ్లారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



శాయంపేట : మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఆత్మకూరు : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

శాయంపేట : రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ కో కన్వీనర్ నరహరిశెట్టి రామకృష్ణ, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి అన్నారు. తెలంగాణలో పసుపు బోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించినందుకు మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో ఆదివారం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కల సాకారం కనుందన్నారు. రైతులకు పసుపు బోర్డు, విద్యార్థులకు గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి ఉప్పు రాజు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు చిట్టిరెడ్డి మల్లారెడ్డి, దళిత మోర్చ అధ్యక్షుడు మంద సురేష్, మండల కోశాధికారి కుక్కల మహేష్, నాయకులు బాసాని విద్యాసాగర్, కడారి చంద్రమౌళి, బాసాని నవీన్, మునుకుంట్ల చంద్రమౌళి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీదే విజయం

ఆత్మకూరు: రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని నాగయ్యపల్లెకు చెందిన పలువురు ఆదివారం బీజేపీలో చేరాగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో బీఆర్‌ఎస్ మాయమాటలు చెబుతుందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సదానందం, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌టీఐ కన్వీనర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ 15శాతం ప్రకటించాలి

విద్యారణ్యపురి: తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మధ్యంతర భృతిని (ఐఆర్) 15శాతం ప్రకటించాలని బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ టీచర్స్ సెల్ చైర్మన్ తిరువరంగం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐఆర్‌ను కేవలం 5శాతంగా ప్రకటించటం అంటే ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

నాగయ్యకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు ధర్మారపు నాగయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. శిరంశెట్టి కాంతారావు రచనలు – సమగ్ర పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ధర్మారపు నాగయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు.

చిన్నారికి ఆర్థిక చేయూత

హన్మకొండ: విద్యుదాఘాతానికి గురై చికిత్స పొంది ఇంటికి చేరుకున్న చిన్నారికి ఎస్‌జేపీ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. హనుమకొండ 10వ డివిజన్‌లోని మచిలీబజార్‌కు చెందిన బియాబాని నాజియా ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురికాగా తీవ్రగాయాలయ్యాయి. ఈక్రమంలో చిన్నారిని ఎస్‌జేపీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సాగర్, కార్యదర్శి మహ్మద్ ముస్తాక్, నేహాల్, సభ్యులు కేతిడి దీపక్ రెడ్డి, షేక్ సర్వర్, శరత్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక చేయూతనందించారు.

కేటీఆర్ పర్యటనను నిరసిస్తూ నేడు పరకాల బంద్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల: అమరవీరుల జిల్లాగా ప్రకటించకుండా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పరకాలకు ఎలా వస్తారని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి పర్యటనను నిరసిస్తూ సోమవారం పరకాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 10 ఏళ్ల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నసమయంలో పరకాల మున్సిపాలిటీ కార్యాలయ నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఆ భవన నిర్మాణం పూర్తి అయ్యేందుకు 10 ఏళ్ల తన పేరుతో ఉన్న శిలాఫలకాన్ని తొలగించడం సిగ్గు చేటన్నారు. పరకాలపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గంలోని అనేక గ్రామాల ప్రజలు నిరసనలు, నిలదీతలో స్వాగతం పలుకుతుండటంతో ఓటమి భయం పట్టుకుందన్నారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా బీజేపీ పిలుపునిచ్చిన బంద్‌లో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, మేకల రాజు, కౌన్సిలర్లు ఆర్‌పీ జయంత్‌లాల్, బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్యతో పాటు పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం

హన్మకొండ: బీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు మొలుగూరి భిక్షపతి అన్నారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గం, రూరల్ ప్రాంతానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పరకాల రూరల్ మండలం అధ్యక్షుడు పుట్ట రవీందర్ ఆధ్వర్యంలో లక్ష్మీపురం, పోచారం గ్రామాలకు చెందిన 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారని తెలిపారు. నాయకులు పాశికంటి రాజేంద్రప్రసాద్, దుబాసి వెంకటస్వామి, వడ్ల మహేందర్, కొత్త శ్రీనివాస్, కొయ్యడ రమేష్, కొయ్యడ చిరంజీవి, వడ్ల మొగిలి, పుట్ట నరేష్, ఓదెలు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడి 'ఆశ'ల నిరసన



బతుకమ్మ ఆడుతున్న ఆశ కార్యకర్తలు

ఎల్కతుర్తి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు చేపట్టిన సమ్మె ఆదివారంతో 14వ రోజుకు చెరుకుంది. ఈ సందర్భంగా భీమదేవరపల్లి, ఎల్కతుర్తిలో ఆశ కార్యకర్తలు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు రూ. 18వేల వేతనం చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 14 రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఆశ కార్యర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా నాగరాజు



నియామక పత్రం అందుకుంటున్న నాగరాజు

ధర్మసాగర్: మండలంలోని పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన యాట నాగరాజు ముదిరాజ్‌ను బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు దూడల సిద్ధయ్యగౌడ్ తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటే ఉపేందర్‌యాదవ్‌తో కలిసి ఆదివారం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.



ప్రమాదకరంగా కాజీపేట బ్రిడ్జి రెయిలింగ్

- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- భయాందోళనలో బాటసారులు
- కొత్త గోడలు నిర్మించాలని వేడుకోలు



ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి రెయిలింగ్

కాజీపేట: రోడ్లు, భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం .. పట్టింపులేనితనం వల్ల కాజీపేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి రెయిలింగ్ ప్రమాదకరంగా మారింది. దాదాపు నాలుగున్నర దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన బ్రిడ్జి గోడలు బీటలువారి ఎప్పుడు కూలి కింద పడుతాయో తెలియని దుస్థితి నెలకొంది. ప్రతిఏటా రూ.లక్షలాది ప్రభుత్వ నిధులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తూ పాత కాలం నాటి గోడలకే రంగులు వేసి అధికారులు మమ అనిపిస్తున్నారు తప్ప తాకితే కూలిపోయేలా ఉన్న గోడలను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శిథిలావస్థలో గోడలు

రైళ్లు, వాహనాల రాకపోకలతో బీటలువారిన గోడలు నిత్యం కంపిస్తున్నాయి. ముట్టుకుంటే కూలిపోయేలా ఉన్న గోడలను అధికారులు పరిశీలించి, తగు మరమ్మతులు చేయించాలి. లేకుంటే ఏదో ఒకరోజు పెను ప్రమాదం వాటిల్లుతుందని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పక్క నుంచి నిత్యం రాకపోకలు సాగించే వెంకటాద్రినగర్ వాసులు.. బ్రిడ్జి రక్షణ గోడలు కూలి ఎక్కడ మీద పడుతాయేననే భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పాత గోడలను కూల్చివేసి కొత్తగా నిర్మించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సమసిన ఐలమ్మ విగ్రహ వివాదం

కాజీపేట: ఇటీవల గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో అపహరణకు గురైన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహం ఎట్టకేలకు రజక సంఘం నాయకుల వద్దకు చేరింది. చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, సీపీ డాక్టర్ ఏవీ.రంగనాథ్ ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఏసీపీ డేవిడ్‌రాజ్ పర్యవేక్షణలో రజక సంఘం నాయకుల చెంతకు ఐలమ్మ విగ్రహం చేరింది.

ఇంటలెక్చువల్ ఫోరం సేవలు అభినందనీయం



న్యూశాయంపేట: పేదల సంక్షేమం కోసం మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం చేస్తున్న సేవలు అభినందనీయమని కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో మెగా దూ – బ – దూ (ఉచిత వివాహ పరిచయ వేదిక)ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం యువతీ, యువకులు పరిచయ వేదికకు హాజరయ్యారు. ఫోరం కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్దిఖీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులు నాస్రీన్, ఎంఏ.నయీం, డాక్టర్ రాజామాలిక్, సయ్యద్ అక్బర్, నదీమ్‌బేగ్, మాషూఖ్ రబ్బానీ, తాజొద్దీన్, నుస్రత్, మెరాజ్ సుల్తానా పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. కల్యాణ్ (S.R) : 8686236437 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)